ప్రజాశక్తి
ఆదివారం 26 ఫిబ్రవరి 2023 5 విజయనగరం

హోం హెల్త్‌కేర్ అసిస్టెంట్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

గాయత్రీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీ, సెంచూరియన్ యూనివర్సిటీ, స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు 5 నెలల హోం హెల్త్ కేర్ అసిస్టెంట్స్ కోర్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ కోర్సులో చేరుటకు వయస్సు 17 నుంచి 35 ఏళ్లలోపు, పదో తరగతి చదివి ఉండాలి. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఆస్పత్రులు, ఇళ్లలో వృద్ధుల సంరక్షణలో ఉద్యోగాలు పొందే అవకాశముంటుంది. గాయత్రీ విద్యా పరిషత్తు ఆస్పత్రుల్లో శిక్షణ ఉంటుంది. నిరుద్యోగులైన విభిన్న ప్రతిభావంతులు, తక్కువ వినికిడి లోపమున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఎడి జగదీశ్ ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్, 89859 53000 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ జీవిత బీమా..
ఇదేం పద్ధతమ్మా...?

- గగనంగా మారిన ఎపిజిఎల్ఐ డబ్బులు
- రెండేళ్లుగా ఉద్యోగుల ఎదురుచూపులు
- విశ్రాంత ఉద్యోగులకు చెల్లించని ప్రభుత్వం

ఎపిజిఎల్ఐ కార్యాలయం

నగరంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ తన కుమార్తె వివాహం కోసం ఎపిజిఎల్ఐ రుణం కోసం దరఖాస్తు పెట్టుకొని రెండేళ్లు గడిచిపోయాయి. నేటికీ ఆ డబ్బులు ఎపిజిఎల్ఐ నుంచి మంజూరు కాలేదు. ఆ డబ్బులు వచ్చాక తిరిగి చెల్లించొచ్చని వడ్డీకి రూ.6 లక్షలు తీసుకున్నారు. ఎపిజిఎల్ఐ డబ్బులు రాకపోవడంతో రెండేళ్లుగా వడ్డీ కడుతూనే ఉన్నారు.

నగరంలోని రెవెన్యూ కాలనీకి చెందిన కలెక్టరేట్ ఉద్యోగి ఇంటి నిర్మాణానికి రుణం కోసం ఎపిజిఎల్ఐకి దరఖాస్తు చేసుకున్నారు. 14 నెలలు గడిచినా డబ్బులు రాలేదు. దీంతో ఇంటి నిర్మాణం మధ్యలో ఆగి పోయింది.

ఇలా అవసరాలకు ఆదుకోవాల్సిన ఎపిజిఎల్ఐ డబ్బులు ఉపయోగ పడకపోగా, అది మరింత కష్టాలను తెచ్చిపెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎపిజిఎల్ఐ ద్వారా ఉద్యోగులకు భరోసా కల్పించాల్సిన స్థితి నుంచి ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయా? అని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సిన దుస్థితి నేడు నెలకొంది. అవసరాల కోసం దాచుకున్న డబ్బులు ప్రస్తుతం ఉపయోగపడక పోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుమారుగా 25 వేల మందికి పైగా ఉన్నారు. వీరందరి భద్రత కోసం డబ్బులను ప్రయివేటు ఇన్స్యూరెన్స్ కంపెనీల కంటే ప్రభుత్వ సంస్థ అయిన ఎపిజిఎల్ఐలో డబ్బులు కట్టుకుంటే భద్రతతోపాటు అవసరాలకు ఉపయోగ పడుతుందని నమ్మకముంది. అందుకే ఎపిజిఎల్ఐలో ఉద్యోగ, ఉపాధ్యాయులు డబ్బులు దాచుకుంటున్నారు. అవసరాలు కోసం, ప్రయివేటు సంస్థల కంటే అధికంగా వడ్డీతో పాటు భద్రత ఉంటుందని భావించిన డబ్బులు నేడు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా ఎపిజిఎల్ఐ ద్వారా రుణాలు పొందే అవకాశముంది. సర్వీసులో రిటైరవ్వడానికి ముందు క్లయిములు చెల్లించాలి. వీటితోపాటు రిటైరైన వారికి వారి బాండ్ల ఆధారంగా డబ్బులు చెల్లించాల్సి ఉంది. ఈ మూడు రకాల చెల్లింపులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. వీటి కోసం ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కూడా కలెక్టరేట్, మండల కార్యాలయాల వద్ద నిరసనలు చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎపిజిఎల్ఐ ద్వారా చెల్లించాల్సిన డబ్బులు నేటికీ ఇవ్వకపోవడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డబ్బులు తమకు ఇవ్వకపోవడం అన్యాయమని, ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళన బాట తప్పదని ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం ఈ బకాయిలు ఎప్పటికీ చెల్లిస్తుందో వేచి చూడాల్సిందే.


ఎపిజిఎల్ఐ నుంచి డబ్బులు రావాల్సిన విశ్రాంత ఉద్యోగులు

రూ.12.45 కోట్ల క్లయిములు పెండింగ్

జిల్లాలో ఎపిజిఎల్ఐ నుంచి 490 మంది ఉద్యోగులకు రూ.12,45,49,002 చెల్లించాల్సి ఉంది. ఉద్యోగులు బాండ్ల సమయం ముగిసినా గత రెండేళ్లుగా చెల్లించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం క్లయిమ్ పెండింగ్ అమౌంట్ చెల్లించాలని వారు కోరుతున్నారు.

రూ.2.49 కోట్ల రుణాలు

జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 226 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు వివిధ అవసరాల కోసం ఎపిజిఎల్ఐ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారు. రుణానికి దరఖాస్తు చేసుకుంటే నెలన్నర రోజుల్లో రావాల్సిన డబ్బులు ఏళ్ల తరబడి మంజూరు కాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు రూ.88 లక్షలు

జిల్లాలో గత రెండేళ్లలో 42 మంది ఉద్యోగులు వివిధ శాఖల్లో ఉద్యోగ విరమణ పొందారు. వీరికి రూ.88,80,903 చెల్లించాల్సి ఉంది.వాస్తవానికి ఉద్యోగి రిటైర్ కావడానికి రెండేళ్ల ముందు నుంచి వారికున్న బాండ్లను బట్టి డబ్బులు చెల్లించాల్సి ఉంది. అయినా ఎపిజిఎల్ఐ డబ్బులు చెల్లించకపోవడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చలివేంద్రాలను ప్రారంభించండి

- సచివాలయాల సేవలు మెరుగుపడాలి
- ప్రతిఒక్కరికీ ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి
- మండల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

ఎండలు పెరగడంతో వెంటనే చలివేంద్రాలను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జగనన్న గృహనిర్మాణం, ఉపాధిహామీ పనులు, సఖి గ్రూపులు, మహిళల్లో పోషకాహార లోపం, బాల్య వివాహాలు, టీనేజ్ గర్భాల నివారణ, ఆధార్ అప్‌డేషన్, ఫ్యామిలీ ఫిజిషియన్ తదితర కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. ప్రతీ పదేళ్లకు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ఆరేళ్ల లోపు పిల్లల వివరాలను తప్పనిసరిగా సచివాలయాల్లో శతశాతం నమోదు అయ్యేలా చూడాలన్నారు. వయసు నిర్ధారణకు వారి పాఠశాల రికార్డులనే ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో బాల్య వివాహాలను, టీనేజ్ గర్భాలను పూర్తిగా నివారించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికోసం మండల ప్రత్యేకాధికారులతోపాటు, పోలీసుల సహకారం కూడా అవసరమని చెప్పారు. మహిళల్లో రక్తహీనతను నివారించడానికి కృషి చేయాలని సూచించారు. గర్భిణులందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు చెడు మార్గం పట్టే అవకాశం ఉన్నందున పాఠశాలల సమీపంలో ఉన్న పాన్‌షాపులను తొలగించాలని సూచించారు. మండల కేంద్రాల్లో, మున్సిపాల్టీల్లో వెంటనే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో గృహనిర్మాణ ప్రగతి బాగుందని కలెక్టర్ అభినందించారు. ఉగాది రోజున జిల్లాలో సుమారు 34 వేల ఇళ్లలో గృహప్రవేశాలను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 24వేల ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన పదివేల ఇళ్లను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ సోమవారం మండల కేంద్రాల్లో కూడా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించాలని సూచించారు. ఉపాధిహామీ కన్వర్జెన్సీ నిధులతో సిసిరోడ్లు, బిటి రోడ్లు తదితర అప్రాధాన్య పనులకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు . జిల్లాలో సుమారు రూ.500 కోట్లతో 6,700 సిసి రోడ్లకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. ఈ పనులను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జగనన్న తోడు పథకానికి లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రత్యేకాధికారులు మండలాల్లో పర్యటించేటప్పుడు తప్పనిసరిగా హాస్టళ్లను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పారిశ్రామిక సదుపాయాల కల్పనపై చర్చ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన డిఐఇపిసి (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ) సమావేశంలో పారిశ్రామిక సదుపాయాలు, భవిష్యత్తు అవకాశాలు, ఉద్యోగ కల్పన తదితర అంశాలు చర్చకు వచ్చాయి. రానున్న రోజుల్లో జిల్లాలో ఏర్పాటు కానున్న పరిశ్రమలు, జరగనున్న అభివృద్ధి గురించి వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు చర్చించారు. తీసుకోబోయే చర్యల గురించి వివరించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాకు చెందిన వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొని భవిష్యత్తు కార్యాచరణపై వారి అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లాలో ఉన్న అనుకూల పరిస్థితులను ఉపయోగించుకొని పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. మార్చి 3, 4వ తేదీల్లో విశాఖపట్నం వేదికగా జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్ సమ్మిట్‌లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల శాఖ జిఎం పాపారావు విజ్ఞప్తి చేశారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి ఏడో తేదీన ప్రత్యేక పారిశ్రామిక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎంఇ విభాగం ఎడి చంద్రమౌళి వెల్లడించారు.

సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

1,37,344 ఎకరాల్లో రబీసాగు

- నెలాఖరులోగా ఇకెవైసి చేయించుకోవాలి
- జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రబీ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం 1,63,571 ఎకరాలకు గాను ఇప్పటివరకు 1,37,344 ఎకరాల్లో సాగు నమోదైంది. ఇ-పంట ద్వారా ఇంతవరకు 1,31,166 ఎకరాలను 84,828 రైతులు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది వరి, మొక్కజొన్న, పెసర, మినుము పంటలను పంటల బీమా పథకానికి ప్రభుత్వం ద్వారా గుర్తించింది. వాటి సాగు విస్తీర్ణాన్ని పట్టికలో చూడొచ్చు.

రబీలో ఇ-పంట నమోదు చేసిన రైతులకు ఇకెవైసి చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 91 శాతం ఇకెవైసి నమోదు చేశారు. ఇంకా ఇ-కెవైసి చేయించుకోవాల్సిన రైతులు ఈ నెలాఖరులోగా ఆర్‌బికెల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు తెలిపారు. అలా నమోదు కాకుంటే రైతులకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పంటల బీమా, వడ్డీ రాయితీ, పంట కొనుగోలు, పంట నష్టపరిహారం వంటివి వర్తించవని చెప్పారు. యంత్ర సేవ పథకంలో భాగంగా జిల్లాలో 184 కమ్యూనిటీ హైరింగ్ గ్రూపుల వారు ఏ విధమైన యంత్ర పరికరాలను తీసుకోలేదని తెలిపారు. వీరు వెంటనే స్పందించి మార్చి ఐదో తేదీలోగా యంత్ర సామగ్రిని 40 శాతం రాయితీపై కొనుగోలు చేయవచ్చని తెలిపారు. అందుకోసం మండల వ్యవసాయ అధికారిని కలిసి వివరాలు పొంది, రైతు చెల్లించాల్సిన సొమ్మును వెంటనే కట్టాలని విజ్ఞప్తిచేశారు.

పంట పేరు	సాధారణం	సాగు విస్తీర్ణం
వరి	3237	639
మొక్కజొన్న	20,821	23,664
పెసలు	12,598	9,422
మినుములు	20,685	18,861

బాల్య వివాహాలపై కఠిన చర్యలు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, అనధికారికంగా బాలలను దత్తత తీసుకున్నా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అధికారులను ఆదేశించారు. శనివారం మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. బాల్య వివాహాలు జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, బాలలతో పనిచేస్తున్న సంస్థలు సంఘాలు నిరంతరం పర్యవేక్షణ చేసి పూర్తి స్థాయిలో నిర్మూలించాలని సూచించారు. బాల్య వివాహాలు చేసిన వారిపై పోలీస్ కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాలలను దత్తత తీసుకున్న వారు ఆ పిల్లలను సక్రమంగా పెంచుతున్నారా? లేదా? అన్నదీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి తనిఖీ చేయాలన్నారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై సమీక్ష, సమావేశాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి సచివాలయంలోనూ బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన తదితర వాల్‌పోస్టర్లను ప్రదర్శించాలని చెప్పారు.

వేధింపులకు గురైన బాలలు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కేసలి అప్పారావు, గెద్దం ఉమ

దిశ పోలీస్‌స్టేషన్ సందర్శన

నగరంలోని దిశ పోలీస్‌స్టేషన్‌ను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ శనివారం సందర్శించారు. జిల్లాలో ఇటీవల బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు నేపథ్యంలో దిశ స్టేషన్‌ను వారు సందర్శించారు. సంబంధిత అధికారులతో కలిసి బాధిత బాలలు, వారి తల్లిదండ్రులతో కలిసి మాట్లాడి సంఘటనలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బాలలపై లైంగిక వేధింపులు, అఘాయిత్యాలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా బాలలతో స్నేహపూర్వకంగా ఉండాలని, నిరంతరం పర్యవేక్షణ అవసరమని తెలిపారు. పాఠశాలల్లో నైతిక విలువలతో కలిగిన విద్యను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షులు హిమబిందు, సభ్యులు భవాని, సుధారాణి పట్నాయక్, పోలీస్ అధికారులు వెంకటేశ్వర్లు, శేషు, ఐసిడిఎస్ పీడీ శాంతికుమారి, బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధులు సాయి విజయ లక్ష్మి, శోభారాణి, రమాదేవి, చైల్డ్ లైన్ సిబ్బంది దుర్గ మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఇయు నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక టెలిఫోన్ భవన్లో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని అలుగు వెంకట్రావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సర్కిల్ అధ్యక్ష, కార్యదర్శి లచ్చిరాజు, కె.రమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా జి.శివాజీరాజు, ప్రధానకార్యదర్శిగా అలుగు వెంకట్రావు, సహాయ కార్యదర్శిగా టి.కృష్ణకుమారి, కోశాధికారిగా బి.భానుచందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్.రమణమ్మ, అక్కమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఉద్యోగులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ దాలినాయుడు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి ఉద్యోగులు పనిచేయాలని కోరారు. అనంతరం డిజిఎంను ఉద్యోగులు సన్మానించారు.

బిఎస్ఎన్ఎల్ డిజిఎం దాలినాయుడును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఎన్నికలయ్యే వరకు స్పందన రద్దు

డిఆర్ఒ గణపతిరావు

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు డిఆర్ఒ గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత (మార్చి 13 తర్వాత) తిరిగి స్పందన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్పందనకు వచ్చే అర్జీదారులు గమనించాలని కోరారు.

ప్రయత్నంతోనే సులువుగా విజయాలు

ఆర్ఎంఆర్‌సి శాస్త్రవేత్త రంజిత్

ప్రజాశక్తి-విజయనగరం

మానవ ప్రయత్నంతో పెద్ద విజయాలు కూడా అతి సులువుగా సాధించవచ్చని ప్రాంతీయ వైద్య పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ మనో రంజన్ రంజిత్ అన్నారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన గౌరవసభలో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్లు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన విధంగా పరిశోధనా రంగంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. మానవతా విలువలను పెంచేలా విద్యార్థులకు తర్ఫీదునివ్వాలని సూచించారు. డాక్టర్ మనో రంజన్ రంజిత్‌ను మార్గదర్శకంగా తీసుకోవాలని సీతం విద్యార్థులు, ప్రొఫెసర్లకు కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, విభాగ అధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

యల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధం

నేడు తొలేళ్ల సంబరం • 200 మందితో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - జామి

జామి యల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. గత ఏడాది వరకు కరోనా హెచ్చరికలతో జాతరకు జనం తాకిడి గణనీయంగా తగ్గింది. కానీ ఈసారి 3 లక్షలకు పైగా జనం తరలి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు వాతావరణం కూడా అనుకూలంగా ఉంది. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటుచేశారు.

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

యల్లారమ్మ జాతర జిల్లాలోనే ప్రసిద్ధి. శివరాత్రి వెళ్లిన మొదటి అష్టమి రోజున జరిగే ఈ జాతరకు ఉత్తరాంధ్ర నుంచే కాక, రెండు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా నుంచి కూడా యాత్రికులు వచ్చి, ముడుపులు చెల్లించుకుంటారు. ఎండలు ఉండటంతో చలివేంద్రాలు అత్యధికంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వైద్య శిబిరాలు అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ప్రధాన ఘట్టం నేడే

యల్లారమ్మ జాతరలో ప్రధాన ఘట్టం తొలేళ్ల సంబరం. ఆదివారం రాత్రి అమ్మవారి గద్దె నుంచి పూజారి ఊరేగింపుగా బయలుదేరి, ప్రధాన ఆలయ ప్రవేశం జరుగుతుంది. భారీ జన సందోహం మధ్య ఊరేగింపు ఉంటుంది. సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక, డ్యాన్స్ బేబి డ్యాన్సులు నిర్వహిస్తారు. అమ్మవారు ఆలయ ప్రవేశ అనంతరం యాత్రికులు ముడుపులు చెల్లించడానికి బయల్దేరతారు. తెల్లవారు జాము నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు జాతర సాగుతోంది. మంగళవారం చిన్న తీర్థం ఉంటుంది.

పటిష్ట బందోబస్తు

యల్లారమ్మ జాతరకు 200కు పైగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎస్.కోట సిఐ సింహాద్రి నాయుడు, ఎస్ఐ వీరబాబు ఆధ్వర్యంలో పది మంది వరకు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రధానంగా దొంగతనాల నివారణతోపాటు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిపెట్టారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

పవరూ లేదు... పైసలూ లేవు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



పేరుకే సర్పంచులం... పవరూ లేదు... పైసలు అంతకన్నా లేవు. ఇదీ ఉమ్మడి జిల్లాలో సర్పంచుల ఆవేదన. ఎన్నికైతే మాత్రం గ్రామాలను ఏమైనా అభివృద్ధి చేశారా? ఇదీ పబ్లిక్ టాక్. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యధ. కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సర్పంచులు విధులు తప్ప, అధికారానికి, ఆర్థిక స్వావలంబనకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వమూ నోరు మెదపకపోవడంతో సర్పంచుల పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సరిగ్గా రెండేళ్ల క్రితం మూడు దఫాలుగా గ్రామ సర్పంచ్ ఎన్నికలు జరిగిన విషయం విదితమే. వారికి పదవులైతే వచ్చాయి గానీ అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు రావడం లేదు. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో మరికొంచెం పట్టుకోల్పోవాల్సిన దుస్థితి దాపురించింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇవ్వాల్సిన నిధుల్లో కోత విధిస్తోంది. ప్రజల నుంచి వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్న కేంద్రం రాజ్యాంగం ప్రకారం నిధులను కేటాయించాల్సి ఉంది. పంచాయతీలకు సగటు మనిషికి రూ.8 చొప్పున, మండల, జిల్లా పరిషత్తులకు రూ.4 చొప్పున కేటాయించాలి. ఈ లెక్కన ఉమ్మడి విజయనగరం జిల్లాకు 2022-23 ఆర్థిక సంఘానికి సంబంధించి మండల, జిల్లా పరిషత్తులకు 15 శాతం చొప్పున రూ.40 కోట్లు, గ్రామ పంచాయతీలకు 70 శాతం చొప్పున సుమారు రూ.93 కోట్ల మేర రావాలి. ఏటా ఇలా వస్తున్న నిధులతోనే తాగునీటి పథకాలు, పారిశుధ్య నిర్వహణ, వాటిలో పనిచేస్తున్న సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ ఛార్జీలు, గ్రామాల్లోని ఇతర సమస్యలు పరిష్కరించేవారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంఘం నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో స్థానిక సంస్థలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లుగా మూడు నెలల నుంచి, ఆరు నెలల బకాయి కొనసాగించగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో నెలలో ముగియనున్నప్పటికీ పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సర్పంచులతోపాటు ఎంపిటిసి సభ్యులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజల కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇటు ప్రజలు అటు పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్యం, వాటర్‌వర్క్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్తు బకాయిలూ సకాలంలో తీర్చలేకపోవడంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురి కావాల్సి వస్తోంది. మరోవైపు కరోనా కారణంగా 2020 నుంచి రిజిస్ట్రేషన్లు, దుకాణాల అద్దెలు వంటివి అమాంతంగా తగ్గిపోవడంతో స్థానిక సంస్థలకు రావాల్సిన ఆదాయం తగ్గింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నప్పటికీ ఒకే దేశం, ఒకే పన్ను అంటూ ప్రజలపై వివిధ రూపాల్లో రకరకాల పన్నులు మోపేందుకు, ధరల పెంపునకు మాత్రం కేంద్రం వెనుకాడటం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ఎంపి, ఎమ్మెల్యే వంటి ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ ముఖ్య నాయకులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా పరస్పర రాజకీయ విమర్శలు, విన్యాసాలు మినహా ప్రజల సమస్యలు గానీ, కేంద్రం చూపుతున్న వివక్ష గానీ పట్టడం అధికార ప్రతిపక్షాలకు పట్టడం లేదు.

విద్యుత్తు ఛార్జీల చెల్లింపునకు పంచాయతీలు కటకటలాడుతున్నాయి. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించలేని దుస్థితి దాపురిస్తోంది. తాగునీటి పథకాల నిర్వహణ, నీటి సరఫరా బహు భారంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఇలా ఒకటేమిటి కేంద్ర ప్రభుత్వ వైఖరితో స్థానిక సంస్థల మనుగడ దినదిన గండంగా మారింది. పాలకులు మాత్రం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదు. అభివృద్ధి అనే మాటను పూర్తిగా పక్కనబెట్టేసి సాధారణ నిధులతోనే కాలక్షేపం చేస్తున్నారు. గ్రామ స్థాయిలో సర్పంచులు మాత్రం ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. పాలకుల వైఖరిపై సర్పంచులు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రనిధులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొంతమందిలో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. ఇటువంటి తరుణంలో కేంద్రాన్ని నిలదీయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కూడా మెతకవైఖరి ప్రదర్శిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాగునీటి సమస్యలపై డిపిఒకు ఫిర్యాదు

జామి : మండల కేంద్రంలోని మంగళవీధి, కొత్తలి వారి రామకోవిల, 8వ వార్డుల్లో తాగునీటి సమస్యలపై పంచాయితీ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలంటూ జిల్లా పంచాయితీ అధికారికి మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పెద్దబాబు మాట్లాడుతూ, ఇప్పటికే కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని ఆరు నెలలు కావస్తున్నా పట్టించుకోకపోవడంతో డిపిఒకు ఫిర్యాదు చేశామన్నారు. మరుగునీరు తాగునీటిలో కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నా, పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష పోరాటం చేస్తానని హెచ్చరించారు.

పైపులైన్ పనులు వాయిదా

బొబ్బిలి : వేసవిని దృష్టిలో పెట్టుకుని పైపులైన్ పనులను వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. భోజరాజపురం నుంచి పట్టణానికి వచ్చే ప్రధాన పైపులైన్ పనులు ఆదివారం చేయాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేశామన్నారు. బలిజిపేట రోడ్డులో పాత పైపులైన్ తీసివేసి నూతన పైపులైన్ వేస్తామని చెప్పారు. వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పైపులైన్ పనులు వాయిదా వేసమన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశానికి అర్హత

శృంగవరపు కోట: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో మైత్రి విద్యానికేతన్ కోచింగ్ సెంటర్‌కు చెందిన వై. శ్యామ్ అనే విద్యార్థి 230 మార్కులతో ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశానికి అర్హత సాధించాడని విద్యానికేతన్ డైరెక్టర్ జి. ఎల్లారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాథ్స్‌లో 150 మార్కులకు గాను 147 మార్కులు సాధించినట్లు తెలిపారు. సైనిక స్కూల్ ప్రవేశానికి అర్హత సాధించిన వై శ్యామ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

రమాప్రభకు మద్దతుగా విస్తృత ప్రచారం

బొబ్బిలి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. బొబ్బిలి పట్టణంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె. విజయగౌరి, బి.రమేష్, కె. కృష్ణదాసు, పి.సత్యనారాయణ ప్రచారం చేపట్టారు. పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు సమస్యలపై గళం విప్పేందుకు రమాప్రభను గెలిపించాలని కోరారు. గ్రామాల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం బృందాలుగా వేర్వేరుగా ప్రచారం చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

బొబ్బిలి : మున్సిపాలిటీలో 7, 30వ వార్డులో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా వార్డు కౌన్సిలర్లు దిబ్బ సునీత, వాడపల్లి వనజకుమారి కోరారు. వారం రోజులుగా తాగునీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వార్డులో తాగునీరు బోర్లు పాడైపోవడంతో తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. బోర్లు బాగు చేయాలని, తాగునీరు ప్రతిరోజు సరఫరా చేయాలని కోరారు.

నేడు, రేపు వైజ్ఞానిక ప్రదర్శన

బొబ్బిలి : స్థానిక శ్వేతాచలపతి సంస్థానం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆదివారం, సోమవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జార్జ్ ఫ్రాన్సిస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు. 25 రోబోటెక్ ప్రదర్శనలు, వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రదర్శనకు వచ్చే వారు రాజావారి విందు రెస్టారెంట్ ఎదురుగా వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు.

ఆర్‌ఎంపికి ఆర్థిక సాయం

గంట్యాడ : మండలంలోని నందాం ఆర్‌పి వైద్యులు కొల్లి జగన్నాథానికి గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కొల్లి జగన్నాథం కొంతకాలంగా బ్రెయిన్ స్ట్రోక్, మదుమేహం, హర్ట్ స్ట్రోక్‌తో బాధపడుతున్నట్లు తెలుసుకున్న చిరంజీవి శనివారం నందాం వెళ్లి ఈ సాయాన్ని మాజీ సర్పంచ్ సంక్రాన రంగన్న చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం కార్యదర్శి కోట్ల పైడిరాజు, ఉపాధ్యక్షులు ఎం. రామ్మూర్తి రాజు, కోశాధికారి ఉమా శంకర్, చీపురుపల్లి జనార్ధన్, స్థానిక గ్రామీణ వైద్యుడు అప్పలస్వామి పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని 1 నుంచి నిరసన

వేపాడ : నిధులున్నా, అటవీ అధికారుల అనుమతులున్నా మారిక గ్రామానికి రోడ్డు వేయకపోవడం దుర్మార్గమని సిపిఎం జిల్లా నాయకులు జగన్ అన్నారు. శనివారం గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడారు. మారిక రోడ్డు నిర్మాణాన్ని కొంత వరకు చేసి వర్షం పేరుతో, పులి పేరుతో ఆపేశారన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం ప్రారంభించకపోతే మార్చి ఒకటిన ఎంపిడిఒ కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమంతో నిరసన తెలుపుతామన్నారు. వైద్య, విద్య ఇతర మౌలిక వసతులకు రోడ్డే ప్రధానమని తెలిపారు. ప్రజలు అడగకపోయినా పచ్చటి పంట పొలాల్లో గ్రీన్ ఫీల్డ్ హైవేలు, రకరకాల హైవేలు, రైల్వే లైన్లు వేస్తున్న ప్రభుత్వాలు యాళ్ల నుంచి మొరపెట్టుకుంటున్న ఈ గ్రామానికి రోడ్డు ఎందుకు వేయరని ప్రశ్నించారు. గడపగడపకు కార్యక్రమాన్ని పెట్టి రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న పనులు గురించి చెబుతున్నారే తప్ప నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యే చెప్పలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిలో ఆనందరావు, రామకృష్ణ, లింగరాజు అప్పలనాయుడు, ఆసు శ్రీనుతో పాటు పాత, కొత్త మారిక యువకులు, మహిళలు పాల్గొన్నారు.

'స్థాయి సమావేశానికి హాజరుకండి'

వేపాడ : ఎస్‌కోట మండల కేంద్రంలో ఆదివారం జరగనున్న నియోజకవర్గ స్థాయి టిడిపి సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యచరణపై చర్చిస్తారని చెప్పారు.

ఎస్‌డబ్ల్యుపి షెడ్డు పరిశీలన

వేపాడ : మండలంలోని వల్లంపూడి సచివాలయం పరిధిలో నిర్మించిన ఎస్‌డబ్ల్యూపి షెడ్డును ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ శనివారం పరిశీలించారు. ఇక్కడ పారిశుధ్య కార్మికులు చేస్తున్న పనులను అభినందించారు. మండలంలోని మిగతా ఎస్‌డబ్ల్యూపి షెడ్లు అన్నిటి కన్నా వల్లంపూడి షెడ్డు బాగుందని ఇక్కడ కార్మికులు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇందుకు కారణమైన పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మిని కూడా అభినందించారు. గ్రామాలలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికుల వల్లే అది సాధ్యమని ఆయన అన్నారు. కార్మికులకు రెండు జతలు చెప్పులు, రెండు జతలు బ్లౌజులు, ముళ్లపారలు పంచాయతీ నిధుల నుండి తక్షణమే అందజేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

విజయనగరం టౌన్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు.. ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి దిశా నిర్దేశం చేశారు. శనివారం జెడ్‌పి చైర్మన్ కార్యాలయంలో జిల్లాలోని వైసిపి సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కో-కన్వీనర్లతో నియోజకవర్గాల వారీగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియాని ఒక అస్త్రంగా మలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణమే ముఖ్యం

విజయనగరం టౌన్ : పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణంలో విద్యనభ్యశిస్తే విద్యార్థుల్లో మానసిక అభివృద్ధి సాధ్యమని సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. స్థానిక గురజాడ పాఠశాలలో విద్యార్థుల పట్టభద్రుల కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర, ఉపాధ్యాయుల బాధ్యతను చక్కగా వివరించారు. పిల్లలు చూసింది వేగంగా అవలోకనం చేసుకుంటారన్నారు. జెవివి జాతీయ నాయకులు ఎం.వి.ఆర్. కృష్ణాజీ మాట్లాడుతూ చిన్న అలవాట్లు పిల్లల పెంపకంలో ఎంత ప్రభావితం చేస్తాయో సవివరంగా చెప్పారు. అనంతరం బహుముఖ పోటీలు బాలలకు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం మానవుడు ఎలా ఉండేవాడో నృత్యరూపకంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్‌ఎం పూడి శేఖర్ పాల్గొన్నారు.

సఖి గ్రూప్ సభ్యులతో సమావేశం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బొద్దాం గ్రామంలో అంగనవాడీ సూపర్‌వైజర్ జి. కామేశ్వరి ఆధ్వర్యంలో శనివారం సఖి గ్రూపు సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సఖి అంటే ఏమిటి, సఖి గ్రూపులు అంటే ఏమిటి? వారు చేయవలసిన విధులు గూర్చి వివరించారు. న్యూట్రిషన్, ఆరోగ్యంపై అవగాహన, పరిశుభ్రత గూర్చి వివరించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ వేపాడ, వల్లంపూడి బొద్దాం గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు ఎం. శ్రీదేవి, మహాలక్ష్మి, బి. రాజేశ్వరి, మహిళ గ్రామ సచివాలయ కానిస్టేబుల్ విజయ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వేపాడ: విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉద్యోగులు

గరివిడి: బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల వేధింపులు, సమస్యల నుండి రక్షణ కల్పించి బాధితులకు సఖి కేంద్రాలు అండగా సేవలు అందిస్తున్నాయని మహిళా పోలీసు లావణ్య అన్నారు. శనివారం స్థానిక శివసాయి హై స్కూల్లో సఖి కేంద్రాల సేవలు పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖీ కేంద్రాల ద్వారా న్యాయ సేవలు కూడా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి ఎఎన్ఎం పార్వతీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, వాండ్రంగి గణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: బాల్య వివాహాలతో అనర్థాలు కొని తెచ్చుకున్నట్లేనని వీటిని పూర్తిగా నిర్మూలించాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు గోపాలకృష్ణ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. బాల్య వివాహాలు వల్ల జరిగే నష్టాలు గూర్చి వివరించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిఒ ఆర్. ఉమాదేవి, సూపర్ వైజర్ కె.రవణమ్మ, కెవి స్వర్ణలత, వియ్యంపేట ఆసుపత్రి సిబ్బంది కె. తిరుపతిరావు, పిహెచ్ఎన్ కె. జగదాంబ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన బస్సు

విజయనగరంకోట: అనకాపల్లి నుంచి విజయనగరం వస్తున్న పల్లె వెలుగు బస్సు శనివారం ఇంజిన్ ఫెయిలై స్థానిక జిల్లా కోర్టు ఎదురుగా ఆగిపోయింది. దీంతో అందులో ఉన్న ప్రయాణికులు కొంతమేర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారిని వేరే బస్సుల ద్వారా పంపించారు. రోడ్డుపై బస్సు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలిగింది.

మొక్కలు నాటిన విసి

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు జివి ప్రాంగణంలో శనివారం వైస్ చాన్సలర్ కె.వెంకట సుబ్బయ్య మొక్కలను నాటారు. ఇఇఇ విభాగాధిపతి ఎ.పద్మజ పర్యవేక్షణలో క్లిక్ స్టూడెంట్స్ క్లబ్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విసి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి ఒక మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీకుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వి.ఎస్.వకుళ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులను ప్రజలు గుర్తించాలంటే ప్రతి కార్యక్రమం వారి ద్వారా జరగాలన్నారు. రీ సర్వే పేరుతో రెవెన్యూ అధికారులు ప్రజల అవసరాలకు సహకరించటం లేదని అందువల్ల మండలంలోని అభివృద్ధి పనులు నత్తనడక నడుస్తున్నాయని ఆయన అన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు మూడు నెలల కాలవ్యవధిలో మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఇప్పటికే ధాన్యం కొనుగోలు 98శాతం పూర్తయిందని ఈ నెల 28వ తేదీతో ధాన్యం సేకరణ ముగుస్తుందని ఎవరైనా ధాన్యాన్ని అమ్మదలుచుకుంటే రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు. హౌసింగ్ డిఇ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది నాటికి జగనన్న కాలనీలలో గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌వి సత్య శేఖర్ మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో అన్ని వసతులూ కల్పించినప్పటికీ డెలివరీకి ప్రభుత్వ ఆసుపత్రికి రావడం లేదని అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, అరకు ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా గిరిజనులు పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి డెలివరీ నిమిత్తం వస్తున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు పూర్తిగా లంచాలతోనే పని చేస్తున్నారని జగనన్న సమగ్ర భూ సర్వే సామాన్యునికి వ్యతిరేకంగానూ భూస్వాములకు అనుకూలంగా నిర్వహిస్తున్నారని కృష్ణాపురం సర్పంచ్ యామిని ఆరోపించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి మమ్ములూరు వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపిలు ఇందుకూరి సుధా రాజు, పినిశెట్టి రమణ, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

జూనియర్ సివిల్ జడ్జి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గజపతినగరం

జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి శనివారం గజపతినగరం పంచాయతీ పరిధిలో దిగువీధిలో ఉన్న బాలసదన్ వసతిగృహం, ప్రాథమిక పాఠశాలను ఆకసిమ్కంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మంచాలు, పరుపులు, తలగడలు అందరికీ సరిపడా ఉన్నట్లు గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో జగనన్న గోరుముద్ద భోజన పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పిల్లల మూత్రశాలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వేసవి దృష్ట్యా మంచినీటి సౌకర్యాన్ని అందుబాటులో ఉంచాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. ఈ తనిఖీలలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వంటలను పరిశీలిస్తున్న జడ్జి కనకలక్ష్మి

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - వంగర

అన్ని వర్గాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయమని విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గృహ సారథులు, సచివాలయ పరిధిలోగల కన్వీనర్లతో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే నినాదంతో మండలంలోని మడ్డు వలసలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. టిడిపి ప్రభుత్వం జన్మభూమి, పుష్కరాలు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేస్తుంటే తెలుగుదేశం పార్టీ నాయకులు సిగ్గు లేకుండా ప్రభుత్వం పైన బురద జల్లుతోందని మైండిపడ్డారు. అనంతరం గృహ సారథులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మి, బొక్కేల వెంకట అప్పలనాయుడు, వివిధ గ్రామాల వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి బెల్లాన చంద్రశేఖర్

ఉగాదికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - వేపాడ

ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తిత చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. మండలంలోని బక్కునాయుడు పేటలో శనివారం హౌసింగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారు మాట్లాడుతూ గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుము, కూడా ప్రభుత్వమే ఇస్తున్న తరుణంలో నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకూ చేపట్టిన నిర్మాణాలకు బిల్లులు కూడా మంజూరు చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ శ్రీనివాసరావు, మండల పరిషత్ పంచాయతీ విస్తరణ అధికారి సిహెచ్ సూర్యనారాయణ, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారి ఎండి కుతుబ్జా ఆలీ, గృహ నిర్మాణ సంస్థ ఎఇ సూర్యనారాయణ, కార్యదర్శి ధనలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ పట్నాయక్

వేపాడ సచివాలయ సందర్శన

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బిఎస్‌ఎన్‌కె పట్నాయక్ శనివారం పరిశీలించారు. ముందుగా రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన సఖీ గ్రూపు వల్ల బాలికలకు కలిగే ప్రయోజనం గురించి సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, సచివాలయం మహిళా కానిస్టేబుల్, ఉన్నారు.

అమృత్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి- గరివిడి

చీపురుపల్లి పట్టణంలో స్థానిక కస్పావీధికి చెందిన ఎస్. అమృత్‌ను వైసిపి నాయకులు శనివారం శ్రీసాయి విద్యా నికేతన్ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష్ మాట్లాడుతూ 80శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ అమృత్ తన తెలివితేటలతో అమెజాన్ కంపెనీలో రూ.3లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించడం గొప్ప విషయమన్నారు. అన్ని అవయవాలు సరిగా ఉన్నా చాలా మంది ఉద్యోగం సాధించడానికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అటువంటి వారంతా అమృత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల నాయకులు ఇప్పిలి అనంతం, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, పట్టణ వైసిపి అధ్యక్షులు పతివాడ రాజారావు, మంగళగిరి శ్రీను, సూరు కామేష్, కోరుకొండ దాలయ్య, టెలికాం డైరక్టర్ ఇప్పిలి తిరుమల, శివాలయం డైరక్టర్ ప్రభాత్ కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ సుంకరి చంద్రశేఖర్ గుప్త, వార్డు మెంబెర్ గంట్యాడ విష్ణు, పాండ్రంకి వాసు, మొండేటి కిషోర్, పేకాపు ప్రసాద్, శ్రీ సాయి విద్యానికేతను స్కూల్ మేనేజ్మెంట్ వలిరెడ్డి పద్మ, కరస్పాండెంట్ కిల్లంశెట్టి గీత, ప్రధానోపాధ్యాయులు గవిడి భారతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అమృత్‌ను సత్కరిస్తున్న వైసిపి నాయకులు

పాఠశాలలో వార్షిక క్రీడా సమావేశం

ప్రజాశక్తి- రేగిడి

రాజాం మండల కేంద్రంలోని చైతన్య పాఠశాల విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే 'క్రీడా సమావేశ' పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయనగరం, పార్వతీపురం జిల్లాల రీజనల్ అధికారి వి. శ్రీనివాస్, రాజాం అర్బన్ సిఐ కె. రవికుమార్ హాజరయ్యారు. ముందుగా రీజనల్ అధికారి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థి ఒత్తిడితో కూడిన విద్యను అభ్యసిస్తున్నటువంటి నేపథ్యంలో విద్యార్థికి ఉపశమనం కలిగించడానికి క్రీడలు అత్యవసరమని చెప్పారు.

అనంతరం సిఐ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, మనిషి ప్రస్తుతం ఆచరిస్తున్నటువంటి ఆహారపు అలవాట్లు ద్వారా ఆరోగ్య వంతునిగా ఉండడానికి క్రీడలు, వ్యాయామం, ఎంతో దోహదపడతాయని చెప్పారు. పాఠశాల ప్రధానాచార్యులు ఎస్. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్య అందించడం శ్రీ చైతన్య ప్రత్యేకతని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్ బాలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు మాలతీరాజ్, డీన్ హరి శ్రీనివాసరావు, సురేంద్ర, బుచ్చెం నాయుడు, ఏవో ఎల్లం నాయుడు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు..

కొట్యాడలో పారిశుధ్య పనులు

లక్కవరపుకోట : మండలంలోని కొట్యాడలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ కొట్యాడ దేవిమహేష్ ఆధ్వర్యంలో కాలువలలో పూడికలు తీయించి ఎప్పటికప్పుడు బ్లీచింగ్ జల్లుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తలారి గ్రామంలో వచ్చేనెల 1,2,3 తేదీలలో జరగనున్న అచ్చియమ్మ తల్లి తీర్థమహోత్సవం సందర్భంగా పారిశుధ్య పనులు ముమ్మరం చేస్తున్నామని వివరించారు. ప్రతి వీధిలోను బ్లీచింగ్ జల్లించడమే కాకుండా దోమల మందు పిచికారి చేస్తున్నట్లు చెప్పారు.

పారిశుధ్యం పనులు చేస్తున్న కార్మికులు

రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి- వేపాడ

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎస్‌కోట సహాయ సంచాలకులు బి చలపతిరావు ఆదేశించారు. శనివారం వేపాడ పశువైద్య కేంద్రంలో గోపాలమిత్రలు, పశుసంవర్ధక శాఖ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను రైతులకు సకాలంలో అందించినప్పుడే సిబ్బందికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం 75 శాతం రాయితీపై అందిస్తున్న సమీకృత పశు ధానాను, పశుగ్రాస విత్తనాలను అధిక శాతం రైతులకు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. పశువులకు కాలానుగుణంగా చేయవలసిన వ్యాధి నిరోధక టీకాలను వేసి సకాలంలో ఆన్‌లైన్ చేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా ఎహెచ్‌ఎలు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం హాజరు వేయాల్సి ఉందని ఒక పూట వేయకపోయినా ఆ రోజంతా సెలవుగా గుర్తిస్తామని చెప్పారు. కాగా దబ్బరాజుపేట గ్రామంలో నిర్వహించిన గర్భ కోసవ్యాధుల చికిత్స శిబిరంలో 25 పశువులకు చికిత్సలు జరిపి మందులను ఉచితంగా పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో బి సింహాచలంనాయుడు, ఏహెచ్‌ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎడి చలపతిరావు

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి- రేగిడి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార చైర్మన్ ఎం. బాబు, జూనియర్ సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణ సాయి తేజ అన్నారు. ఈ మేరకు శనివారం నారాయణ పాఠశాలలో న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ద్వారా ఆరు నుంచి 14 ఏళ్ల వయసు గల పిల్లలు ఉచిత విద్యకు అర్హులన్నారు. ప్రాథమిక హక్కు ఎంత ముఖ్యమో విధులు కూడా అంతే ముఖ్యమని అన్నారు. కుల, వర్గ, వర్ణ, వివక్ష చూపరాధని తెలిపారు. పోటీ ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రెడ్డి విజయ్ కుమార్, ముదిలి శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, రాజాం టౌన్ ఎస్ఐ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు..

సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

నేరాలు ఘోరాలు

ఇసుకాసురుల దాహానికి మూగజీవాలు బలి

బండితో పాటు నదిలో మునిగిపోయిన ఎడ్లు

జామి: మండలంలోని తానవరం గ్రామంలో ఇసుకాసురుల దాహానికి రెండు మూగ జీవాలు బలైన ఉదాంతం కలిచివేసింది. ఇసుక తవ్వకాల్లో భాగంగా శనివారం ఉదయం తానవరం గ్రామానికి చెందిన సిరికి సూర్యచంద్రరావు అనే రైతు తన ఎడ్ల బండిని నదిలోకి తీసుకువెళ్లాడు. పాత ప్రాంతంలో కాకుండా కొత్త ప్రాంతంలో ఇసుకను తీసేందుకు వెళుతున్న సమయంలో నదిలో నీరు అడ్డుపడింది. పెద్ద లోతు ఉండదని భావించి నీటిలోకి బండిని దించేశాడు. కానీ అక్కడ ప్రమాదకరమైన గొయ్యి ఉండడంతో ఎడ్లు బండితో సహా పూర్తిగా మునిగిపోయాయి. ఈ ప్రమాదంలో ఎడ్లకు ఊపిరాడక మరణించాయి. బండిపై ఉన్న సూర్య చంద్రరావు కూడా ఈత రాక బండి వెనుక భాగాన్ని పట్టుకొని కేకలు వేయడం స్థానికులు గుర్తించి అతనిని కాపాడారు. ట్రాక్టర్ సహాయంతో ఎడ్లను, బండిని బయటికి తీశారు. కానీ అప్పటికే ఎడ్లు మరణించాయి. మరణించిన ఎడ్లు విలువ దాదాపు రూ. 80 వేల వరకు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గోస్తనీ నదిలో ప్రమాదకరమైన గోతుల వలన ఇప్పటికే అనేకమంది మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి.

మృతి చెందిన ఎడ్ల వద్ద రోధిస్తున్న రైతు

వివాహిత అనుమానాస్పద మృతి

- పెళ్లయిన ఆరు నెలలకే ఉరేసుకుని ఆత్మహత్య?
- అత్త, మామ, భర్త, ఆడపడుచులపై అనుమానం

రేగిడి : పెళ్లయిన ఆరు నెలలకే అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన ఘటన ఉంగరాడలో శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం ఉంగరాడ గ్రామానికి చెందిన గులివిందల ధనలక్ష్మి(21) ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. ఆమె తండ్రి రౌతు గణపతి రావు పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. ఇదే మండలం జోడుబందల గ్రామానికి చెందిన రౌతు గణపతిరావు కుమార్తె ధనలక్ష్మిని ఉంగరాడ గ్రామానికి చెందిన గౌరినాయుడుకు ఆగస్టు 2022న ఇచ్చి వివాహం చేశారు. ఈమె మూడు నెలలు గర్భవతి కూడా. వీరి మధ్య ఇటీవల గొడవలు ప్రారంభమయ్యాయి. ఆమెపై అత్తింటి వేధింపులు కూడా పెరిగాయి. దీంతో ధనలక్ష్మి తన తల్లిదండ్రులకు విషయాన్ని వివరించింది. ఇంతలోనే ఆమె ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలున్నాయని ఆమె తండ్రి గణపతిరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధనలక్ష్మి తన అత్త లక్ష్మి, మామ సూర్యనారాయ, భర్త గౌరినాయుడుల వేధించి తన కూతుర్ని చంపేశారని ఆరోపిస్తున్నారు. ఇందులో ఆమె ఆడపడుచులు జ్యోతి, యశోదలు పాత్ర కూడా ఉందని చెబుతున్నారు. ఎస్ఐ ఈశ్వరరావు, ఏఎస్ఐ రాజారావు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. శరీరంపై ఉన్న గాయాలను పరిశీలించారు. డిఎస్‌పి బి మోహన్ రావు, సిఐ ఉపేంద్ర సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పంచినామా నిర్వహించి రాజాం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే అత్తా, మామ, భర్త పరారీలో ఉన్న నేపథ్యంలో అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

మృత దేహాన్ని పరిశీలిస్తున్న సిఐ ఉపేంద్ర